శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ముఖ్యమంత్రి జగన్ ను కలిసిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి



**నెల్లూరు,సెప్టెంబరు14 ప్రభాతవార్త–విద్య** రా ష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపలి ్లలోని ఆయన క్యాంపు కార్యాలయంలో తూర్పురాయలసీయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాధపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జిల్లా కు సంభందించిన రాజకీయ విషయాలు, ఇటీవల నగరంలో నిర్వహించిని విద్యాసదస్సు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాష్ట్రంలో మెట్ట మెదటి సారిగా నగరంలో విద్యా సదస్సును నిర్వహించటం పట్ల ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్పూర్తితో జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమం త్రి సూచించినట్లు సమాచారం. అనంతరం ఆయన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందించి సత్కరించారు.

## పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబరు14,ప్రభాతవార్త** వర్షకాలపు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నగర వ్యాప్తంగా డ్రైను, కాలువల్లో పూడిక తీత పనులు, మురుగు పారుదలకు చర్యలు, దోమల వ్యాప్తి నిర్మూలన వంటి వివిధ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ అధికారులకు సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా వేదాయపాలెం, అయ్యప్పగుడి, ఆర్‌అండ్‌ఆర్ గెస్ట్ హౌస్ తదితర ప్రధాన మార్గాల్లోని ప్రాంతాలను గురువారం ఉదయం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా జరుగుతున్న పారిశుధ్య పనులను కమీషనర్ పర్యవేక్షించి అధికారులు, సిబ్బందికి సూచనలు జారీ చేశారు. తడి, పొడి చెత్తను వాహనాల ద్వారా ఇళ్ల నుంచి మాత్రమే సేకరించాలని, వీధుల్లో వ్యర్థాలు వేస్తున్న ప్రాంతాలను గుర్తించి స్థానికులను హెచ్చరించాలని సూచించారు. వీధుల్లో వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పించి పారిశుధ్య నిర్వహణకు ప్రజలంతా సహకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రైను కాలువల పూడికతీత సిల్టును ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, దోమల వ్యాప్తి లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణ మెటీరియల్ వీధుల్లో నిల్వ చేయకుండా పర్యవేక్షించాలని, రోడ్లను ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసి అపరాధ రుసుం వసూళ్లు చేయాలని సచివాలయ కార్యదర్శులను కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి, శానిటరీ సూపర్‌వైజర్‌లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్దంగా నిమజ్జన ఏర్పాట్లు



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** వినాయక చవితి పండుగ సందర్భంగా నగర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రణాళికబద్దంగా ఏర్పాట్లు చేయాలని నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఇరుకళల పరమేశ్వరి ఆలయం సమీపంలోని నిమజ్జనం ఘాట్, పెన్నా బ్యారేజీ తిక్కన పార్కు దగ్గర ఏర్పాటు పనులను కమీషనర్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ పండుగ అనంతరం నిమజ్జనం కార్యక్రమం కోసం ఘాట్ వద్ద భారీ క్రేన్‌లు, మర బోట్లు, బారికేడ్ల ఏర్పాటు, రాత్రి పూట లైటింగ్, సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణ, ట్రాఫిక్ కంట్రోల్ నిమత్తం మైక్ అనౌన్స్‌మెంట్ తదితర వసతులు కల్పించాలని ఆదేశించారు.పారిశుధ్య విభగం ఆధ్వర్యంలో కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను కేటాయించి ట్రాక్టర్లు, చెత్త సేకరణ ఆటోలతో ఘాట్ ప్రాంగణం నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని కమీషనర్ సూచించారు. నిమజ్జనం జరిగే చెరువు ప్రాంతంలో ఆకులు, పూలు, ఇతర వ్యర్థాలు వేయకుండా భక్తులకు సూచనలు చేయాలని సిబ్బందికి చెప్పారు. ఘాట్ ప్రాంగణం వద్ద అన్ని రక్షణా చర్యలతో పాటు భక్తుల కోసం మంచినీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే నిమజ్జన విగ్రహాలను ప్రణాళికబద్దంగా ఘాట్ ప్రాంతానికి తీసుకొచ్చేలా అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఆరోగ్యశాఖాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

## రైసుమిల్లులో వ్యక్తి మృతి



**ఉదయగిరి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామ శివారులలో గల రైస్ మిల్లులో ఒక వ్యక్తి మృతి చెందివుండడం గమనించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయగిరి సర్కిల్ ఇనస్పెక్టర్ వి.గిరిబాబు ఎస్.ఐ ఇంద్రసేనారెడ్డితో కలిసి మృతదేహాన్ని పరిశీలించారు.గ్రామస్తులను,రైసుమిల్లు ఓనర్‌ని,రైసుమిల్లులు పనిచేసే సిబ్బందిని విచారించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రావెళ్ళ రమణయ్య (38) మద్యానికి బానిస అయి అతిగా మద్యం సేవిస్తు ఆహారం తీసుకోకుండా వుండడం వల్ల రైసుమిల్లు వెను బాగంలో ఉన్న వరిపొట్టులో మద్యం సీసాలు దాచుకొని తాగేవాడని అక్రమంలో అక్కడే పడిపోయి మృతి చెందినట్లు వారు తెలిపారు.మృతదేహాన్ని పరిశీలించినప్పుడు అతని దుస్తులలో నుండి రెండు మద్యం బాటిల్స్‌ని కనుక్కోవడం జరిగిందని తెలిపారు. ఈవిషయమై విచారించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కారును ఢీ కొన్న గ్యాస్ సిలిండర్ల లారీ ...నలుగురికి గాయాలు

**వరికుంటపాడు,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త :** ఎదురెదురుగా వెళ్తున్న రెండు వాహనాలు ఢీ కొన్న ఘటనలో నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని కాకొల్లువారిపల్లి సమీపంలో 565 వ జాతీయ రహదారి పై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది.స్తానికులు తెలిపిన వివరాల మేరకు కడప జిల్లా మైలవరం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో విజయవాడ నుండి మైలవరం కు వెళుతుండగా,అనంతపురం నుండి చీమకుర్తి కి గ్యాస్ సిలిండర్ల లోడుతో వెళుతున్న లారీ కాకొల్లువారిపల్లి వద్దకు వచ్చేసరికి కారును ఢీ కొట్టింది.దింతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. వారిలో కారు డ్రైవర్ సుఫాల్ కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి లారీ డ్రైవర్ ఖాజా ను అదుపులోకి తీసుకున్నారు .కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అదుపు తప్పి లారీ బోల్తా -తృటిలో తప్పిన ప్రమాదం

**వింజమూరు,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** కావలి నుండి గోవాకు జామాయిల్ కర్రతో వెళుతున్న 12టైర్ల భారీ వాహనం బొమ్మరాజు చెరువు గ్రామం దాటిన వెంటనే అదుపుతప్పి రోడ్డుప్రక్కన బోల్తాపడింది. కావలి నుండి కర్రలోడుతో బయలుదేరిన లారీ వింజమూరు నుండి నెల్లూరు వెళుతున్న పామూరు బస్సును తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో క్లీనర్‌కు స్వల్ప గాయాలైనాయి. పెద్ద ప్రమాదం జరగకపోవడం వారు ఊపిరి పీల్చుకున్నారు.

## చట్టం దృష్టిలో అందరూ సమానులే



**ముత్తుకూరు,సెప్టెంబర్14, ప్రభాతవార్త** పంటపాలెం బైపాస్‌రోడ్డులో ఉన్న బుంగి ఆయిల్ కంపెనీ నందు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది.ఈ సదస్సుకు నెల్లూరు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జ్ కె.వాణి ముఖ్య అతిధులుగా హాజరై పర్యావరణం గురంచి తెలియజేస్తూ కంపెనీ వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం న్యాయసహాయము భారతదేశంలో వ్యక్తుల మధ్య వచ్చే తగాదాలు కోర్టు ద్వారా పరిశీలించుకోవడానికి అధిక కాలం పట్టడమే కాక అధిక శ్రమ ఖర్చులతో కూడిన పని, సాధారణ ప్రజలు ఈ ఖర్చును భరించలేరని అందువలన 39(ఎ) రాజ్యాంగ అధికరణ ప్రకారం ప్రభుత్వం చట్టం ద్వారా నిర్ధిష్టమైన ప్రణాళికలతో ప్రజలకు ముఖ్యంగా ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు నిరక్షరాశులకు,అంగవైకల్యం ఉన్న వక్తులకు ఉచిత న్యాయసహాయం అందజేయాలి ఈ దిశలో ప్రభుత్వం 1987 సంవత్సరంలో న్యాయ సేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించి దేశవ్యాప్తంగా న్యాయసేవ అధికార సంస్థల నేర్పరచి పటిష్టమైన ఉచిత సేవలు సమాజంలోని వెనుకబడిన వర్గాలకు,మహిళలకు అందజేయాలని సంకల్పించారని తెలిపారు.అనంతరం పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటడం జరిగింది.ఈ కార్యక్రమంలో కంపెనీ ఎం.డి దక్షిణామూర్తి,ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సి.హెచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణపట్నం పోర్టులో వ్యక్తి మిస్సింగ్

**ముత్తుకూరు,సెప్టెంబర్14,ప్రభాతవార్త** ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పోర్టు యాంకరేజ్ పెన్నా వెజల్లో వెట్రి విశ్వ(21) అనే వ్యక్తి గురువారం ఉదయం 4గంటల సమయంలో తప్పిపోవడం జరిగింది.ఈయన రూరల్ తమిళనాడులోని పెన్నా సురక్ష నౌకలో క్యాడెట్‌గా పనిచేస్తున్నారు.కృష్ణపట్నం ఓడరేవుకు 14నాటికల్ మైళ్ల దూరంలో బెంగాల్ బేలో లంగర్ వేసి తదుపరి ప్రయాణానికి అనుమతి కోసం వేచి చూస్తుండగా గురువారం ఉదయం 4గంటల సమయంలో కనిపించలేదు.ధనలక్ష్మీపురం గ్రామం,నెల్లూరు రూరల్ మండలం ఎంపీ పెన్నా సురక్ష నౌక యజమానుల సూచనల మేరకు ఎఫ్ఐఆర్ ఫైల్ చేయడం జరిగింంది.కృష్ణపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# త్వరలో రూ3000 పెన్షన్: మంత్రి కాకాణి



**వెంకటాచలం,సెప్టంబర్14,ప్రభాతవార్త:** భారతదేశం లో ఎక్కడాలేనివిదంగ ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయ వ్యవస్తను ఏర్పాటుచేసి నేరుగ ఇంటి వద్దకే పెన్షన్ పంపణీచేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి పేర్కొన్నారు.వెంకటాచలంలోని కమ్యునిటీ హాలులో గురువారం నూతనంగ మంజూరైన పెన్షన్‌ను లబ్దిదారులకు అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతు సర్వేపల్లి నియోజకవర్గంలో పెన్షన్‌లు ఏడాదికి 156కోట్లు పంపిణీచేస్తున్నట్లు చెప్పారు.గతంలో పెన్షన్ కావాలంటే మరణించినవారి జాబితాలో కొత్తవారిపేర్లు చేర్చేవారని జన్మభూమికమిటి సభ్యులు సిఫార్సు చేసినవారికే పెన్షన్ మంజూరుచేసేవారన్నారు. ఇపుడు వాటికి భిన్నంగ రాజకీయాలకు అతీతంగ అర్హులైన ప్రతి లబ్దిదారుడికి నేరుగ వాలంటీర్‌ద్వార ఆగ్రామంలోనే సచివాలయం వ్యవస్తద్వార నమోదుచేసుకొనే వెసులుబాటు సౌకర్యాన్ని కల్పించామన్నారు.ఇప్పటివరకు 38,651మందికి వివిదరకాల పెన్షన్‌లు అందిస్తుండగ తాజాగ మరో 2100మందికి నూతనంగ మంజూరుచేశామన్నారు.సర్వేపల్లి నియోజకవర్గంలో అర్హులైన ఏవక్కరికికూడా పెన్సన్‌మంజూరుకాలేదని అర్జీ దాఖలాలు ఉండకూడదని అదికారులు ఆదిశగ చర్యలుచేవట్లాలన్నారు.ఈకార్యక్రమంలో డి.ఆర్.డి.ఎ పి.డి సాంబశివారెడ్డి,తహసిల్‌దార్ క్రిష్ణ,ఎం.పి.డి.ఒ రమేష్,ఎం.పి.పి మందా కవిత,ఉప ఎం.పి.పి కనుపూరు కోదండరామిరెడ్డి,జిల్లా వై.సి.పి ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య,మండల కన్వీనర్ మోహన్‌నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్ని ఇబ్బందిపెట్టకుండా వారి సమస్యల్ని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి



**కావలి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** ప్రజల్ని ఇబ్బంది పెట్టకుండా వారి సమస్యల్ని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కావలి నియోజకవర్గంలోని దగదర్తి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యలు జిల్లా కలెక్టర్ సావదానంగా విని వాటికి పరిష్కార మార్గం చూపుతూ అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని ఆదేశించారు. నిర్ణీత గడువు లోగా పరిష్కారం కాకపోతే తనకు తెలియజేయాలని అర్జీదారులకు కలెక్టర్ చెప్పారు. భూముల సర్వేకు సంబంధించి వచ్చిన అర్జీల విషయంలో కావలి ఆర్డీవో శీనానాయక్, ఎడి సర్వే, మండల సర్వేయర్, విఆర్వోల సమక్షంలో అడంగల్ కాపీలు నిశితంగా పరిశీలించారు. ఫారెస్ట్ అధికారి జెకెసికి రాకపోవడంతో డిఎఫ్‌వో ఫిర్యాదు చేశారు. దగదర్తి మండలంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారులు ఇచ్చిన సమస్యలను పరిశీలించి అర్థం చేసుకుని అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో శీనానాయక్, జెడ్పీ సిఇవో బి.చిరంజీవి, డిపివో సుస్మితరెడ్డి, డ్వామా పిడి వెంకట్రావు, పిడి డిఆర్‌డి సాంబశివారెడ్డి, ఎడి సర్వే హనుమాన్ ప్రసాద్, పిడిఐసిడిఎస్ హేనా సుజన్, డిఎస్పీ శివాజీ, డియంహెచ్‌వో పెంచలయ్య, డిఇవో గంగాభవాని, సమగ్ర శిక్ష ఎపిసి ఉషారాణి, సిపివో ఎ.ఎస్.రాజు, ఇండస్ట్రీస్ జియం సుధాకర్, హౌసింగ్ పిడి నాగరాజు, పలువురు జిల్లా అధికారులు, దగదర్తి తహశీల్దార్, ఎండివో, మండల సర్వేయర్, మండల అధికారులు పాల్గొన్నారు.

**వారానికి రెండు మండలాలలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించాలి**

వారానికి రెండు మండలాలలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని ఆ మేరకు జిల్లాలో మొదటిగా దగదర్తి మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని కలెక్టర్ యం.హరినారాయణన్ తెలిపారు. కావలి నియోజకవర్గంలోని దగదర్తి మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముగిసిన అనంతరం కలెక్టర్ హరినారాయణన్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి బుధవారం,శుక్రవారం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మండలాల్లో ముందుగానే ప్రజలకు తెలియజేసి జగనన్నకు చెబుదాం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దగదర్తిలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుండి 110 అర్జీలు అందాయన్నారు. వాటిలో ఎక్కువుగా రెవెన్యూ, భూముల సర్వే, డికెటి పట్టాలు, తదితర వాటిపై అర్జీలు వచ్చాయన్నారు. అలాగే సదరన్ క్యాంపులు గురించి, పంచాయతీల్లో దారి సమస్య, స్మశాన భూముల సమస్యలు, ఇతర సమస్యలు ప్రజల నుండి అందాయన్నారు. వచ్చిన అర్జీలను నిబంధనల ప్రకారం గడువు తేది లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం మే 9న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. అప్పటి నుండి ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో,మండల కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ప్రతి రోజు గ్రామ సచివాలయాలలో, కాల్ సెంటర్ల ద్వారా, ఇతర మార్గాల ద్వారా జగనన్నకు చెబుదాం అర్జీలు స్వీకరిస్తున్నారన్నారు.

# ముఖ్యమంత్రి వెంటే ఉంటాం: మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటానని నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ ప్రకటించారు. గురువారం సాయంత్రం నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరిగిన కొన్ని సంఘటనలు అందరికి తెలిసినవేనని, ఆ సందర్భంలో నేను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కొంత దూరంగా ఉన్నాని తెలిపారు. అయితే అది నా పొరపాటుగా నేను భావిస్తున్నానని మేయర్ చెప్పారు. నేను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలవడంతో వారు కూడా సహృదయంతో పార్టీకిలోకి నన్ను ఆహ్వానించడంతో నేను ముఖ్యమంత్రి వెంటే నడుస్తానని తెలిపారు. జిల్లా పార్టీ పెద్దలు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, పార్లమెంటు సభ్యులు రూరల్ వైసీపీ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, నగర శాసనసభ్యులు అనిల్‌కుమార్ యాదవ్‌ని కలవడం జరిగిందని, వారందరి సూచనలు, సలహాలు మేరకు ముందుకు సాగుతామని మేయర్ స్పష్టం చేశారు, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడం కోసం నా వంతు కృషి చేస్తానని మేయర్ స్రవంతి జయవర్ధన్ తెలియజేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మేయర్ భర్త జయవర్ధన్, వైసీపీ నాయకులు నాగరాజు, ఇంతియాజ్‌లు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కమీషనర్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాలను కమీషనర్ వికాస్ మర్మత్ గురువారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం, బీఈడీ కళాశాల, బీవీఎస్ గర్ల్స్ హైస్కూల్, పత్తివారి స్కూల్, మోడరన్ స్కూల్, ఎంఎస్‌ఎం హైస్కూల్, వివేకానంద ఇంగ్లీషన మీడియం స్కూల్, నల్లంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ తదితర మున్సిపల్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలు కల్పించాలనిఎన్నికల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు దేవీకుమారి, నిర్మలనంద బాబా, ఇతర అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కటకటాల వెనక్కి ఘరాన నేరస్తుడు

**- నేరస్తుడిపై 12 కేసులు నమోదు**

**- ఇద్దరు మహిళలను హతమార్చిన నరహంతకుడు**



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** నగరంలోని స్థానిక ఉమేష్ చంద్ర పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో ఆత్మకూరుకు చెందిన ఘరానా నేరస్తుడిని అరెస్టు చేసిన సందర్భంగా జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలం ఎరుకులసాని నగర్‌కు చెందిన దెయ్యాల తిరుపతయ్య అలియాస్ పులి అలియాస్ పులిగాడు(23) వృత్తిరీత్యా పందులను మేపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడని, మధ్యానికి బానిసై చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ 12 కేసుల్లో ముద్దాయిగా పలు పోలీసు స్టేషన్లో కేసు నమోదు అయినట్లు తెలిపారు. ఈ విధంగా దొంగిలించిన సొమ్ముతో జల్సాలు చేసుకుంటూ బట్టేపాడు బస్సు స్టేషన్ సమీపంలో ఉన్నటువంటి ఒంటరి మహిళ దగ్గర ఉన్నటువంటి బండారు సరుడును గమణించి దానిని ఎలాగైనా దొంగిలించాలని మూడు రోజులుగా పథకం వేసి ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి సమయంలో నిద్రపోతున్న మహిళపై బండరాయితో కొట్టి చంపి ఇంటిలో నుంచి బంగారు తెల్లరాయి ఉంగరం, పదివేల రూపాయలు దొంగతనం చేసినట్లుగా కేసు నమోదు చేసినట్లుగా పోలీసులు తెలిపారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న ఆత్మకూరు పోలీసులు ఎట్టకేలకు కావలి సమీపంలో దొంగిలించిన సొమ్ముతో జల్సా చేస్తున్న తిరుపతయ్యను అరెస్టు చేసి విచారించగా గతంలో జలదంకి పోలీసు స్టేషన్లో ఒక మహిళను హత్య చేసి ఆమె వద్ద ఉన్నటువంటి బంగారు గాజులు కూడా తానే దొంగిలించినట్లుగా ముద్దాయి నేరం అంగీకరించినట్లు తెలిపారు. ఇతను దొంగిలించిన బంగారం విలువ సుమారు రూ.5లక్షల రూపాయలు ఉంటుందని నేరస్తుడిపై సస్పెక్‌షీట్ కూడా నమోదు చేసి ఉందని తెలిపారు. హత్య కేసును చేధించడంలో పథకం చూపించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణు, సబ్ ఇన్‌స్పెక్టర్ ముత్యాలరావు, రాజేష్, సాయి ప్రసాద్‌ను, సిబ్బందిని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందించారు. అడిషనల్ ఎస్పీ హిమవతి, ఆత్మకూరు సబ్ డివిజన్ పోలీసు అధికారి కోటారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బస్సు-ఆయిల్ ట్యాంకర్ ఢీ ...పలువురుకి గాయాలు



**ఉదయగిరి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** ఉదయగిరి మండలం పిపి కుంట వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలు అయ్యాయని ఉదయిరి సి.ఐ వి గిరిబాబు తెలిపారు. బెంగుళూరు నుండి ఉదయగిరికి వస్తున్న బస్సు పిపి కుంట వద్ద ముందు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్‌ను తెల్లవారు జామున ఢీకొట్టడం జరిగిందని సిఐ తెలిపారు. బస్సులో ఉన్న సీతారామపురానికి చెందిన 7 గురుకి స్వల్పగాయాలు కాగా ఒక మహిళకు తీవ్రగాయం అయినట్లు తెలిపారు.క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వారికి వైద్యం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రమాదం పై విచారణ జరుపుతున్నట్లు సిఐ వి.గిరిబాబు ,ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

## అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవు



**ఉదయగిరి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** ఉదయగిరి మండలం గన్నెపల్లి పంచాయితీలోని గడ్డం వారిపల్లికి చెందిన చెరువులో జెసిబిల సహాయంతో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలి స్తున్న వారిపై ఉదయగిరి ఇరిగేషన్ శాఖ ఏఇ చంద్రమౌళి,వేణులు ఆకస్మిక దాడిని నిర్వహించారు. అధికా రుల రాకను పసిగట్టిన అక్రమంగా మట్టితోలే మాఫియా అక్కడ నుండి ఉడాయించారు. ఏఇ చంద్రమౌళి మాట్లాడుతు అనుమతులు లేకుండా ,కుంటలలో మట్టిని తరలించడం చట్ట విరుద్ధమని అలాంటి వారిపై కేసులు నమోదు చేసి శాఖా పరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

## ఎన్నికల రిటర్నింగ్ అధికారి సమీక్ష



**ఉదయగిరి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని తహసిల్దారు కార్యాలయంలో నియో జకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సువర్ణమ్మ గురువారం తహసిల్దారు జగదీష్‌బాబుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఆమె సమీక్ష నిర్వహించి ఓట్లు మార్పులు చేర్పు లు తొలగింపులు వంటి విషయాలలో సిబ్బంది అప్రమత్తంగా వ్యహారించాలని కోరారు. ఓట్లను తొలగించే ప్రక్రియలో సంబందిత అధికారుల ఖచ్చితమైన విచారణ పూర్తి చేసిన వాటిని వెరిఫికేషన్ లిస్టులో ఉంచాలని సూచించారు.ఈకార్యక్రమంలో బిఎల్ఒలు,డేటా ఎంట్రీ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు



**సైదాపురం, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** మండల కేంద్రమైన సైదాపురంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నం దు జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పంచాయతీ కార్య దర్శులకు, గ్రామ వాలంటీర్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పేదలందరికి కుటుంబం, సంక్షేమ ఆరోగ్య భరోసా కల్పించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. మండలంలో శుక్రవారం నుంచి జరగబోయే సర్వేపై ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా ఏఎన్ఎంలు, ఎంపీహెచ్‌పీలు, గ్రామ వాలం టీర్లు లబ్దిదారులకు సంబంధించిన వివరాలను డౌన్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబరు 23వరకు విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్ల వారీగా క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో పాల్గొని ఈ పథకాన్ని విజయవంతం చేయాలని కోరారు. తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ దయాకర్‌రావు, వైద్యులు జనార్ధన్, చరీష్మా, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కమలపూడి కృష్ణారెడ్డి వర్ధంతి



**సైదాపురం, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** మండల పరిధిలోని చాగణం గ్రామంలో వైసీపీ మండల మాజీ అధ్యక్షులు కమలపూడి కృష్ణారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు వస్త్రాలు పంపిణీ చేసి మధ్యా హ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 40సంవత్సరాలుగా సైదాపురం మండలంలో ఎంతో మందికి అనునిత్యం సేవలు అందించిన నేత కమలపూడి కృష్ణారెడ్డి వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వరదబండి ప్రభాకర్‌రెడ్డి, మండల నాయకులు కమలపూడి చంద్రశేఖర్‌రెడ్డి, కమలపూడి సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ పెంచలయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించండి



**నెల్లూరుకార్పొరేషన్, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని వారి ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కార్యక్రమంపై ప్రజలందరికి అవగాహన కల్పించాలని కమీషనర్ వికాస్ మర్మత్ సచివాలయ హెల్త్ కార్యదర్శులకు సూచించారు. జగనన్న ఆరోగ్య సుక్ష శిక్షణా సమావేశాన్ని నగర పాలక సంస్థ కార్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ సమావేశమందిరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించి వర్చువల్‌గా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుండి నిర్వహించనున్నట్లు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలులో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని వారి ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపడం అలాగే ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొనేలా ఆరోగ్య శ్రీ పథకంపై అవగాహన కల్పించాలని హెల్త్ సెక్రటరీలను కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ నెల 15 నుంచి వాలంటీర్ల ద్వారా ఇంటింటి ప్రచారం 16 నుంచి ఏఎన్ఎం, సీహెచ్ఓల ఇంటింటి సర్వే నిర్వహించి సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణీలు, బాలింతలు,తగిన బరువు లేని పిల్లలు, నాన్ కమ్యూనబుల్ వ్యాధులతో బాధపడేవారి వివరాలను జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసి వైద్య శిబిరాల్లో సాధారణ వైద్యులతో పాటు ఆర్థో గైనకాలజి, పీడియాట్రిక్స్ తదితర విభాగాల వైద్య నిపుణులు పాల్గొనేలా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నామని కమీషనర్ తెలిపారు. ఈ శిబిరాలకు వచ్చే రోగులు అవసరమైన ఔషధాలను వెంటనే అందజేసేలా అందుకు అవసరమైన ఔషధాలు అన్నింటిని ముందుగానే నిల్వ ఉంచుకునేలా తగిన చర్యలు తీసుకుంటామని కమీషనర్ తెలిపారు. నగర పాలకఅదనపు కమీషనర్ శర్మద, టీపీ ఆర్ఓ ప్రసాద్, హెల్త్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్స్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోటంరెడ్డిని కలిసిన జనసేన నేతలు



**నెల్లూరు,సెప్టెంబరు14 ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీదర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి లను గురువారం సాయంత్రం నగరంలోనిస్థానిక మాగుంట లేఅవు ట్ రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జనసేన పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్ వారి మద్దతు దారులు, పార్టీ మహిళా నాయకులతో కలిసి మర్యాద పూర్వంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గునుకుల మాట్లాడుతు రాష్ట్ర భవిష్యత్‌ను, ప్రజల దూర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తమ అదినేత పవన్‌క ల్యాణ్ తీసుకున్న జనసేన, తెలుగుదేశం పార్టీల పొత్తులను స్వాగతిస్తున్నామన్నారు. 70 పదుల వయస్సు , ప్రతిపక్ష పార్టీ ప్రధాన నాయకులు, ఉమ్మడి ఆంధ్రా, విభజన ఆంధ్రాకుతొలి సిఎం గా విధులు నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ను అరెస్టు చేసిన తీరు చాలా బాదాకరమన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రూరల్ ఎమ్మెల్యే చేపట్టిన దీక్షకు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని స్పష్టంచేశారు. రానున్న ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేస్తామని ప్రజా ప్రభుత్వాన్ని స్థాపించి తీరుతామని ఆశాభావం వ్యక్తంచేశారు. అనంతరం ఆయనను కోటంరెడ్డి సోధరులు సాధర స్వాగతం పలికారు. నాయుకలు బద్దెపూడి సుధీర్, కోలా విజయలక్ష్మీ, నాయకులు ప్రశాంత్ యాదవ్ , రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ దివాస్



**దుత్తలూరు(వరికుంటపాడు),సెప్టెంబర్ 14,ప్రభాతవార్త :** జాతీయోద్యమంలో భాగంగా అఖిల భారతాన్ని జాగృతం చేసి,ఏకతాటిపై నడిపేందుకు ఎంతో గానో హిందీ భాషా ఉపయోగపడిందనీ ఎస్కెఆర్ పాఠశాల కరస్పాడెంట్ షేక్ అబ్దుల్ రహీం అన్నారు.హిందీ దివాస్ సందర్భంగా మండలంలోని నంది పాడులో ఉన్న ఎస్కెఆర్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.విద్యార్థులకు హిందీ భాషా ప్రావీణ్యతలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాడెంట్ షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారతదేశ అధికారిక భాషగా హిందీనీ గుర్తించి ,సెప్టెంబర్ 14న హిందీ దివాస్‌గా జరుపుకుం టున్నా రన్నారు.ఈ కార్యక్రమములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజా నవాజ్,హిందీ పండిట్ నాజీయా ,ఇతర ఉపాధ్యాయులు ,విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**చేజర్ల,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పౌషకాహార లోపం అధికమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జాతీయ పోషణా మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సురేఖ తెలిపారు. ఈసందర్భంగా చేజర్ల మండలంలోని ఒబులాయపల్లి లో గురు వారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్‌అభియాన్ కార్యక్రమం గురించి గర్భవతులు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహారంలో ప్రతిరోజు పండ్లు, ఆకుకూరలను తీసుకునే విధంగా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణీలు ఉపయోగించు కోవాలన్నారు. ఎలాంటి రక్తహీనత లేకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే విధంగా పౌష్టికాహారం తీసుకోవాల న్నారు. చిరుధాన్యాల వలన కలిగే లాభాలను తెలిపారు. నడిగడ్డ అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో పోషకాహారం మాసోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారంపై గర్భవతులు , చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వరిలో వచ్చే తెగుళ్ళపై అవగాహన



**చేజర్ల,సెప్టెంబర్14,ప్రభాతవార్త:** రైతులు వ్యవసాయంలో వరిసాగు చేసేటప్పుడు వచ్చే తెగుళ్ళు వాటి నివా రణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వనరుల కే ంద్రం డిడిఎ శివన్నారాయణ తెలిపారు. ఈసంద ర్భంగా మడపల్లి వ్యవసాయ సాంకేతిక యాజామన్య సంస్థ ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈసంద ర్భంగా వ్యవసాయాధికారులు మాట్లాడుతూ వరిలో వచ్చే చీడపురుగులు నివారణపై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరిపంటలో వ్యవసాయ అధికారులు చూసిన మేరకే మందులు పిచికారీ చేయాలన్నారు. వరికి తెగుళ్ళు ఆశించినప్పుడు దానికి సంబంధించిన మందు మాత్రమే స్ప్రే చేయాలన్నారు. రాబోయే రబీ సీజన్‌లో వ్యవసాయంపై అనుసరించాల్సి న పద్ధతులపై రైతులకు అవగా హన కల్పించారు. వరిలో ఆకుముడత తెగులు నివారణకు తీసుకోవాల్సి న చర్యలపై అవగాహన కల్పించారు.ఈకార్యకమంలో ఏడిఎ లక్ష్మీమాధవి, పొదలకూరు ఎడిఎ శివనాయక్, మండల వ్యవసాయాశాఖాధికారి శశిధర్, మడపల్లి ఎంపిటిసి సభ్యురాలు పూనూరు భారతి, వైసిపి నాయకులు , మండల జెసిఎస్ కన్వీనర్ పూనూరు గంగాధర్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ఈ సమావేశంలోనే ప్రవేశపెట్టాలి



**నెల్లూరుఅర్బన్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ సాధనకై ఎమ్మార్పీయస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేది నుంచి 22 తేది వరకు జరగబోవు పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, అందుకు ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రంలో పాలక, ప్రతిపక్ష పార్టీలు కృషి చేయాలని ఎమ్మార్పీయస్ జిల్లా కోకన్వీనర్ సూరిపాక ఉదయ్‌కృష్ణ మాదిగ, తాటిపర్తి లక్ష్మయ్య మాదిగల ఆధ్వర్యంలో 6వ రోజు దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఎంఎస్పీ ఎమ్మార్పీయస్ జిల్లా ఇన్‌చార్జ్ సూరిపాక వాసుదేవరావు మాదిగ మాట్లాడుతూ బీజేపీ ఈ పార్లమెంటు సమావేశంలోనే వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, అందుకు ఏపీ, తెలంగాణా ప్రభుత్వాలు ప్రతిపక్షాలు ఒత్తిడి తేవాలని లేదంటే మాదిగల విశ్వరూపాన్ని చవిచూస్తారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ, ఎంఎస్పి జిల్లా కోకన్వీనర్ కోళ్లగట్ల రమేష్ మాదిగ, మాదిగ ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, ఎరుకు హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఇట్టా వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీయస్ జిల్లా కోకన్వీనర్ కె.చందు మాదిగ, ఎంఎంఎస్ నాయకులు రమణమ్మ, ఎంఎస్పీ నాయకులు చింతకుంట అంకయ్య మాదిగ, ఎన్.అడివయ్య, టి.మస్తాన్, ఎంఎస్ఎఫ్ నాయకులు చెంచలభాను. కె.కార్తీక్, కె.మణి, వెంకటరమణయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## హిందీ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం




**బుచ్చి సెప్టెంబర్ 14ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం శ్రీగోపాల కృష్ణయ్య స్కూల్‌లో జాతీయ భాషా దినోత్సవం సందర్భంగా హిందీ పండిట్ అమీర్‌ని పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్,ఉపాధ్యాయులు, విద్యా ర్థులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీదర్ మాట్లాడుతు మనదేశంలో 80 కోట్ల మంది మాట్లాడే బాష హిందీ అని ఆయన తెలిపారు. విద్యార్దులందరు హిందీ మాట్లాడి తమ హిందీ ఉపాధ్యాయుడు అమీర్‌ని సన్మానించారు.ో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన మండలస్తాయి స్కూల్‌గేమ్స్



జలదంకి,సెప్టెంబర్14,ప్రభాతవార్త: గత రెండురోజులనుంచి జలదంకి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ పెడరేషన్ శిక్షణ గురువా రంతో ముగిశాయి. మండలపరిది .లోని గట్టుపల్లి చింతలపాళెం ,బ్రాహ్మణ క్రాక,సోమవరప్పాడు,జలదంకి పాఠశాలలకు చెందిన బాల,బాలికలు ఈఆటలపోటీలలో పాల్గొని తమప్రతిభను చాటారు.కబడి,కోకొ,వాలీబాల్,టెన్నికాయిడ్,బాల్ బ్యాట్‌మెంటన్ సాఫ్టబాల్,యోగ వంటి గేమ్స్,స్పోర్ట్స్ క్రింద లాంగ్‌జంప్,హైజంప్,డిస్కస్‌త్రో,షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించి మండల అత్యుత్తమటీమ్‌ను ఎంపికచేశారు.సెలక్టెడ్ జట్లు త్వరలో వింజమూరులో నిర్వహించే నియోజకవర్గస్థాయి పోటీలలో పాల్గొనవలసి వుంటుందని మండల ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు.ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి పర్యవేక్షణలో జరిగిన పోటీల నిర్వహణా భాద్యతలో ఆయా పాఠశాలల పి.ఇ.టి మాస్టర్లు అనిత,రోసిరెడ్డి,తిరుపతిస్వామిలు పాలుపంచుకున్నారు.

## స్కూల్ గేమ్స్ టోర్నమెంట్‌కి 150 మంది విద్యార్థులు ఎంపిక



**బుచ్చి సెప్టెంబర్ 14 ప్రభావార్త** బుచ్చిరెడ్డిపాళెం మండల స్దాయి స్కూల్‌గేమ్స్ టోర్నమెంట్ సెలక్షన్స్ ఎంపికను పెను బల్లి హైస్కూల్‌లో రెండోవ రోజు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎన్ వెంకట అనంత కృష్ణ మాట్లాడుతు క్రీడల ద్వారా విద్యార్దులలో ఏకగ్రత,ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. మండల స్దాయి పాఠశాలలస్కూల్ గేమ్స్ పెడరేషన్ అండర్ 17 ,14 బాల,బాలికల 9 వ క్రీడలకు 150 మంది ఎంపికైనట్లు ఆయన తెలిపారు.రెండవరోజు విద్యార్దులకు యోగా, వాలిబాల్, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నికోయిట్ క్రీడల ఎంపికల జరిగినట్లు ఆయన తెలిపారు. మండలస్దాయిలో ఎంపికైన విద్యార్దులు సెప్టెంబర్ 20 వ తేదిజరగబోవు నియోజకవర్గ స్దాయి పోటీలలో,జిల్లా జట్ల ఎంపికలో పాల్గొంటారని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యాయమపిడి సిరాజ్ అహ్మద్,పలువురు పిఇటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి



**రాపూరు,సెప్టంబరు14ప్రభాతవార్త** ఈ నెల 18 వతేది నుండి నిర్వహించే గణేష ఉత్స వాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రాపూరు సర్కిల్ ఇనస్పెక్టర్ మలిశెట్టి సుబ్రమణ్యం తెలిపారు. గురువారం కార్యలయంలో ఆయన గణేష ఉత్స వాల నిర్వహణపై మీడియా సమావేవం నిర్వహించారు. రాపూరు సర్కిల్ పరిధిలో గణేష ఉత్స వాలు నిర్వహించే వారు మైకుఏర్పాటుకు పర్మిష్ కోరకు మీ సేవలో కట్టిన చలానా, విద్యుత్ శాఖా అనుమతి,సంబందింత డిడిలు తప్పని సరిగాతీసుకోవాలని, ఉత్స వాల నిర్వహణకు బలవంతపు చందాల వసూళ్ళు చేయరాదన్నారు. దీంత పాటు ఉత్స వాలు ఏర్పాటుచేసే ప్రదేశం విగ్రహం ఎత్తు, బరువు, ఉత్స వం ఎన్ని రోజుల చేస్తారు,ఉత్స వ ఊరేగింపు రూట్ మ్యాప్ వంటి విషయంతోపాటు, విగ్రహాలు నిమజ్జనం చేసే రోజు, నిమజ్జనం చేసే ప్రదేశానికి సంబందించిన వివరాలను ముందుగానే పోలీసులకుతెలిపి అనుమతులు పొందాలన్నారు.అలగే ఉత్స వ కమిటీ సభ్యుల వివరాలు ముందుగానే తెలపాలన్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## ఉత్సాహంగా సాగుతున్న మండల స్ధాయి క్రీడా పోటీలు



**రాపూరు,సెప్టంబరు14ప్రభాతవార్త** స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో రాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్నపోటోలు రెండవ రోజైన గురువారం ఉత్సా హంగా సాగుతున్నాయి. షాట్ పుట్‌లో అండర్ 17 బాలుర విభాగంలో వై. చరణ్,యం. జస్వంత్‌లు,ప్రధమ ద్వితియ స్ధానాలను, బాలికల విభాగంలో ప్రధమ ద్వితియ స్ధానాలను ఎస్‌కె. ఆయేషా, ఆర్. లక్ష్మీ ప్రసన్న, అండర్ 14 బాలుర విభాగంలో వి. కార్తిక్, ఎస్‌డి.అమ్‌రుల్లా, బాలికల విభాగంలో కె.రేష్మ, బి.నవ్య, హైజంప్ అండర్ 17 విభాగంలో ప్రధమ,ద్వితియ స్ధానాలను టి. చందు, టి.శశి రాజ్, అండర్14 లో టి.చైతన్య, టి.నరసింహ, 100 మీటర్ల పందెంలో అండర్ 17లో టి.శశిరాజ్, టి. కిరణ్,బాలికల విభాగంలోఎ.వాణీ,ఎస్‌కె ఆయేషా, యం. మాధవి, 14 విభాగంలో బాలురులో పి.చైతన్య, టి. పెంచల నరసింహ,బాలికలవిభాగంలో పి. ప్రియాంక, ఎ.కళ్యాణి, లు గెలుపొందారు. లాంగ్ జంప్ అండర్ 17లో టి.కిరణ్, జి.మోహన్, బాలికల విభాగంలో వి.శాంతి,ఎస్.కె ఆయేషా, అండర్ 14 బాలురలో పి.చైతన్య, యం.వెంకటరమణ, బాలికల విభాగంలోఎ.కళ్యాణి, బి. వైష్ణవి, డిస్కు త్రో అండర్ 17 విభాగం బాలురలో జి.శ్రావణ్,వై.చరణ్, బాలికలలో ఆర్.లక్ష్మీప్రసన్న, ఎస్‌కె. ఆయేషా, అండర్ 14 బాలురలో వి.వశిష్ట, టి.పెంచలనరసింహ, బాలికలలో కె.రేష్మా, వై.నవ్యలు గెలుపొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దయాకర్ రావు తెలిపారు.

## నేడు రాపూరులో జగనన్నకు చేపుదాంకు కలెక్టర్ రాక

**రాపూరు,సెప్టంబరు14ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరు లో శుక్రవారం నిర్వహించే జగనన్నకు చేపుదాం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌హరినారాయణ్ హజరైతారని యంపీడీఓ అప్పాజీ తెలిపారు. ఈ సమావేశంలో సమస్యల పరిష్కారానికి సంబందిం చి కలెక్టర్ ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. జగన న్నకు చేపుదాంకు అర్జీటు ఇచ్చేందుకు వచ్చే ప్రతి ఒక్కరుఅర్జీతో పాటు, వారి పోన్ నెంబర్, ఆధార్ కార్డు తప్పని సరిగా జత చేయాల్సి వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికిజిల్లా స్ధాయి అధికారులు అందరూ హజరైతున్నందున మండలంలోని ప్రజలు సమస్యల పరిష్కారానికి ఈ జగనన్నకుచేపుదాం కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని కోరారు. ఉదయం 10 గంటలకు మం డల పరిషత్ కార్యలయం ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## జనసేన,టిడిపి కలయిక అద్బుతం

### - మండల పార్టీ అధ్యక్షులు మాదవ్



బుచ్చి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త జనసేన,టిడిపి పొత్తుతో రానున్న ఎన్నికలలో పోటి చేయనున్నట్లు మా నాయకుడు పవన్ కళ్యాణ్ ప్రకటించడం హర్షనీయమని జనసేన మండలాద్యక్షులు మాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన నిర్ణయాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తామని అన్నారు.జనసేన,టిడిపి పొత్తుతో రానున్న ఎన్నికలలో అద్బుతమైన ఫలితాలు సాదించడం జరుగుతుందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని అరెస్టు చేయడం కక్ష సాధింపు చర్యగా ఆయన అభివర్ణించారు.అలాగే మా నాయకుడు పవన్ కళ్యాణ్ రోడ్డు మార్గంలో అమరావతికి రానివ్వకుండా అడ్డుకోవడం కక్షసాదింపు చర్య అని ఆయన విమర్శించారు.ప్రజలు పూర్తి స్ధాయిలో అంతా గమనిస్తున్నారనిఖచ్చితంగా రానున్న అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి,జనసే పొత్తుతో అధికారం రావడం తధ్యమని అన్నారు.

## ఘర్షణలో వ్యక్తికి తీవ్ర గాయాలు



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** నగరంలోని సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో సమీపంలో ఒక యువకుడిని ఐదుగురు కలిసి కొట్టిన సంఘటనలో యువకుడి తలకు గాయాలు తగిలి ఆసుపత్రిలో చేర్పినట్లు కేసు నమోదు చేసినట్లుగా పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో శ్రీను అనే వ్యక్తి యువకుడు నేల క్యాన్లు వేస్తూ జీవనం సాగిస్తూనే వాడిని గురువారం మధ్యాహ్నం సమయంలో ఆ యువకుడిని అయిదుగురు యువకులు విచక్షణా రహితంగా కొట్టడంతో తలకు గాయం అవడంతో సంఘటన స్ధలంలో రక్తసావమై పడిఉన్నాడు. యువకుడిని స్ధానిక పోలీసులు వారి కుటుంబ సభ్యుల సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేసినట్లుగా తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దాడులకు పాల్పడిన యువకులను గాలిస్తున్నట్లుగా సంతపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్‌రాజు తెలిపారు.

## చంద్రబాబు బయటకు రావాల్సిందే



కలిగిరి, శప్టెబర్14, ప్రభాతవార్త; మాజీ ముక్యమంత్రి చంబ్రాబును భేషరతుగా విడుదలచేయాలంటూ తెలగుదేశం పార్టీ నాయకులు కలిగిరిలో రెండవరోజూ గురువారం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఉదయగిరి ఇన్ఛార్జీ బొల్లినేని వెంకట రామారావు ఆదేశాలమేరకు నియోజకవర్గస్ధాయిలో కలిగిరిలో రిలేనిరాహార దీక్షలు జరుగుతున్నాయి.ఈ టిడిపి దీక్షలకు జనసేన తమ పూర్తి మద్దతు తెలియ జేయడమేకాకుండా రిలే నిరాహార దీక్షల్లోసైతం పాల్గొంటున్నారు.ఈ సందర్భంగాటిడిపి నాయకులు ఒంటేరు జైచంద్రారెడ్డి మాట్లాడుతూ దేశంలోనే విజనున్న నాయకుడు చంద్రబాబునాయుడు అన్నాడు. అలాంటి నాయకుడు సెల్‌కంపెనీలో అవినీతికి పాల్గొన్నారని అపవాదును మోపి అక్రమంగా అరెస్ట్‌చేసి జైలులో బందించడం సమజసం కాదన్నారు.ఈ విషయం రాష్ట్రప్రజలందరూ ముక్తకంఠంతో ఖడిస్తున్నారు.ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వం బాబును విడుదలచేయకపోతే బాబు విడుదలయ్యే వరకు బొల్లినేని వెంకట రామారావు ఆదేశంతో ప్రతిమండలంనుండి తరలివచ్చి దీక్షలుచేస్తామన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బిజ్జం క్రిష్ణారెడ్డి,బొల్లినేని వెంకటసుబ్బయ్య,శిద్దులు నాయుడు,జనసేన నాయకులు దిలీప్ కాకు మహేష్,బొగ్గవరపువేణు,కల్లూరి చంద్రమౌళి తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెచ్‌సిఎల్ టెక్ బీ ని సద్వినియోగం చేసుకోండి




**నెల్లూరు, సెప్టెంబరు14 ప్రభాతవార్త-విద్య** ఇంటర్ విద్యార్థులు సంపాదిస్తూనే చదువుకునే అవకాశాన్ని హెచ్‌సిఎల్ టెక్‌బీ కల్పిస్తుందని, దీనిని అందరూ సద్దినియోగం చేసుకోవాలని ఇంటర్ బోర్డు ఆర్‌జేడి వివి.సుబ్బారావు తెలిపారు. గురువారం నగరంలోని స్ధానిక డికె ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థులు, లేదా ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు టెక్ బీ కి అర్హులన్నారు. అలాగే జూనియర్ కళాశాలల్లో ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రిన్సిపాల్స్ కృషిచేయ్యాలని కోరారు. అనంతరం హెచ్‌సిఎల్ టెక్ బీ ప్రతినిది రాజేష్‌కుమార్ మాట్లాడుతు సంస్ధకు సంబందించిన అన్నీ సదుపాయాలు, అందిస్తున్న సేవలతోపాటూ ప్రిన్సిపాల్స్ అడిగిన ప్రశ్నలకు సమధానాలు వివరించారు. ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు మాట్లాడుతు 2023.24 సంవత్సరంలో నిర్వహించాల్సి న వివిధ రకాల కార్యక్రమాలను వివరించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షలో అందరూ ఉత్సా హంగా పాల్గొనాలని కోరారు. ఈనెల 16నుండి జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాల్లో నిర్వహించనున్న త్రైమాసిక పరీక్షలకు పక్కాక నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి మధుబాబు, ఆర్‌ఐఓ కార్యాలయ సిబ్బంది, జిల్లా లోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

## అద్దెభవనంలోకి బిసి హాస్టల్

**బుచ్చి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని బిసి బాలుర వసతిగృహం2ను మరొక అద్దెభవనంలోకి మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు బిసి సహాయ సంక్షేమాధికారిణి శ్రీదేవి తెలిపారు.బుచ్చిలోని హైస్కూల్ సమీపంలో అద్దెభవనం కోసం అన్వేషిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.భవనం అద్దెకు ఇచ్చేవారు ఆత్మకూరు బిసి వెల్ఫేర్ అధికారిణి కలవాలని ఆమె కోరారు.ప్రస్తుతం ఉన్న భవనం పాఠశాలకు దూరం అయినందున వసతి గృహం మారుస్తున్నట్లు ఆమె తెలిపారు.

## చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల నుండి బయటపడాలని ప్రార్ధనలు

**బిట్రగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై పెట్టిన అక్రమ కేసుల నుండి బయటపడాలని ఆయన ఆరోగ్యంతో రిమాండ్ నుండి విడుదల కావాలని మండలంలోని తాళ్ళూరు గ్రామంలో తెలుగు బాప్టిస్టు చర్చి నందు గురువారం టిడిపి నేతలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ యం.నాగేశ్వరరావు, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి లక్కాకుల మాధవరావుల ఆధ్వర్యంలో ప్రార్ధనలు నిర్వహించారు. చంద్రబాబు నిర్దోషిగా విడుదలై 2024లో టిడిపి అధికారంలోకి రావాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, పార్టీ నేతలు కోడూరు వెంకటేశ్వర్లరెడ్డి, యర్రం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏక్ బారత్ శ్రేష్ట్ భారత్‌కు ప్రతీకగా అమృత్ వాటిక నిలువనుంది

### బిజెపి మండలాధ్యక్షులు గండిరఘురామయ్య



**బుచ్చి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** భారతప్రధాని నరేంద్రమోడి పిలుపు మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరీ ఆదేశానుసారం ఈనెల 1 వ తేది నుండి 15 వ తేది వరకు దేశవ్యాప్తంగా బిజెపి తలపెట్టిన అమృత్‌వాటిక నిర్మాణానికి మట్టిన సేకరించే కార్యక్రమాన్ని బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ముమ్మరంగా చేస్తున్నట్లు బిజెపి మండలాధ్యక్షులు గండి రఘురామయ్య తెలిపారు. " నామట్టి-నాదేశం" కార్యక్రమాన్ని బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు,చెల్లాయపాళెం, కాళాయకాగొల్లు, దామరమడుగు గ్రామంలో నిర్వహించగా ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతు ఇంటింటికి వెళ్లి మట్టిని స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అమరవీరులకు గౌరవ సూచికంగా దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో నుండి కలశాల్లో మట్టి సేకరించి డిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక స్తూపం పక్కనే అమృత్ వాటిక పేరుతో ప్రత్యేక స్థూపాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌కు ప్రతీకగా ఈ అమృత్ వాటిక నిలువనున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చ జిల్లా ప్రధానకార్యదర్శి గంజం పెంచల ప్రసాద్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు జల్లి పెంచలయ్య, కిసాన్ మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొర్రు అంకయ్య, బిజెపి మండల ప్రధానకార్యదర్శి పెజాయి క్రిష్ణారెడ్డి, మండల ఉపాధ్యాక్షులు వనె పంట బలరామిరెడ్డి, యల్లాల శివప్రసాద్, మోడెం నిరంజన్‌రెడ్డి,సీనియర్‌నాయకులు చీమల హరినారాయణ, పూండ్ల శ్రీనివాసులురెడ్డి,ఓబిసి మండల ప్రధాన కార్యదర్శి జిల్లెల సంజీవయ్య, కిసాన్‌మోర్చ మండల అద్యక్షులు నెల్లూరు సుబ్రమణ్యం, యువమోర్చ మండల ఉపాధా క్షులు నిడిగల్లు శ్రీదర్ తదితరులు పాల్గోన్నారు.

## ఒక్క ఛాన్స్ అని రాష్ట్రం సర్వనాశనం చేసిన సియం జగన్మోహన్‌రెడ్డి



**కావలి, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ అని ప్రజలను మభ్య పెట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు దుయ్యబట్టారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మాలేపాటి ఆధ్వర్యంలో కావలి టిడిపి కార్యాలయం వద్ద బుధవారం కావలి రూరల్ మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు రెండో రోజు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాలేపాటి మాట్లాడారు. మచ్చలేని నాయకుడు నారా చంద్రబాబునాయుడు అని తెలిపారు. అలాంటి నాయకుడుని అక్రమంగా అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అక్రమంగా గ్రావెల్, ఇసుకను తరలించి సియం జగన్‌రెడ్డి అక్రమంగా సంపాదిస్తున్నది చాలక పిచ్చిపిచ్చి మద్యాన్ని అమ్మి ప్రజలకు పిచ్చిపట్టి స్తున్నారన్నారు. ఎంతోమంది జగన్మోహన్‌రెడ్డి తయారు చేసిన పిచ్చి మద్యం తాగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. మద్యానికి ఎటువంటి లేబుల్స్ లేకుండా అమ్ముతున్నారన్నారు. మద్యానికి ఒకటే లేబుల్ అని అది జగన్మోహన్‌రెడ్డి లేబుల్ అని ఎద్దేవ చేశారు. వైసిపి పాలనలో ప్రజలకు ఇచ్చిన ఇళ్లలో ఎవరు కూడా నివసించలేరన్నారు. అందరు చూస్తున్నారని మీ పాపం పండే రోజులు దగ్గరలో వున్నాయని హెచ్చరికలు చేశారు. జగన్‌రెడ్డి సియం అయిన నాలుగు సంవత్సరాలలో కనిపించని తప్పు ఇప్పుడే కనిపించిందా అని దుయ్యబట్టారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ మంచి నిర్ణయం తీసుకుని టిడిపితో కలిసి పోటీ చేస్తామని ప్రకటించడం శుభపరిణామమన్నారు.రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమని కాబోయేది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని చెప్పారు. సియం జగన్మోహన్‌రెడ్డి లాగా అప్పులు లేకుండా సంపద సృష్టించి ఈ రాష్ట్రాన్ని నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి పథంలో నడిస్తారని తెలిపారు. రిలేనిరాహారదీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. ఈ రిలేనిరాహార దీక్షలో కావలి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, కావలి రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, టిడిపి నాయకులు బొట్లగుంట శ్రీహరినాయుడు, మొగిలి కల్లయ్య, ఏగూరి చంద్రశేఖర్, జ్యోతిబాబురావు, గుత్తికొండ కిషోర్ బాబు, మంచాల ప్రసాద్, తటవర్తి వాసు, దావులూరి దేవకుమార్, గొట్టిపాటి రాము, కర్నాటి వెంకట సుబ్బారావు, మక్కి శ్రీహరి, శీనుబాబు, వెంకటేష్, మస్తాన్, కావలి రూరల్ మండల టిడిపి, కార్యకర్తలు పాల్గొన్నారు.అనంతరం దీక్ష చేస్తున్న నేతలకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

## నూతన పెన్షన్లు పంపిణీ



**బిట్రగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట మేజర్ పంచాయతీలో గురువారం రెండు సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన 23 మంది లబ్దిదారులకు సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గండూరు మంజుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లబ్దిదారులు తమ పింఛను మొత్తాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇంకనూ పంచాయతీలో ఎవరికైనా అర్హత వుండి పెన్షన్ మంజూరు కాకపోతే వెంటనే తమను సంప్రదిస్తే వాలంటీర్ ద్వారా వారి అర్హత గుర్తించి సచివాలయ సిబ్బంది ద్వారా మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెండ్లి వెంకటేశ్వర్లు, ఎంపిటిసి సభ్యులు ఎ.కె.సుందర్‌రాజ్, పార్టీ నేతలు గండూరు శ్రీనివాసులు, యం.శేఖర్, పంచాయతీ కార్యదర్శి ఎస్.కె.మహబూబ్‌బాషా, వార్డు సభ్యులు, వాలంటీర్లు, లబ్దిదారులు పాల్గొన్నారు.

**జువ్వలదిన్నెలో...** జువ్వలదిన్నెలో గ్రామ సర్పంచ్ మామిడి అంకమ్మ ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన 35 మంది లబ్దిదారులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీ వేమిరెడ్డితో మంత్రి కాకాణి భేటి

**నెల్లూరు సిటీ, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** వైసీపీ జిల్లా అద్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో మినీ బైపాస్ రోడ్డులోని వేమిరెడ్డి నివాసంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ భేటీ అయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలతో పాటు పలు అంశాలపై చర్చించారు.



## తొలగించిన ఓట్లపై ఎన్నికల అధికారి ఆరా



**కోవూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :** ఎన్నికల జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని నిశితంగా పరిశీలించేందుకు కోవూరు ఎన్నికల అధికారి ఎం. రాజా రమేష్ ప్రేమ్‌కుమార్ కోవూరు మండలం లేగుంటపాడుగ్రామంలో ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్ల తొలగింపుకు సంబంధించి వారి ఇళ్లకు వెళ్లి మృతిచెందిన, అక్కడి నుంచి పర్మినెంట్‌గా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తొలగింపు చేసిన ప్రతి ఓటర్ వివరాలు రికార్డులో భద్రంగా ఉంచాలని బీఎల్‌వోలకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కోవూరు తహసీల్దార్ ఎం. పద్మజ, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



**కోవూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :** కోవూరు సర్కిల్ పరిధిలోని కోవూరు ఇందుకూరుపేట మండలా ల్లోని అన్ని పంచాయతీల్లో వినాయకచవితి సందర్భంగా ఆయా గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కోవూరు సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా ఒక కమిటీగా ఏర్పాటై ఎప్పుడు విగ్రహం ఏర్పాటుచేస్తారు.. ఏ ప్రాంతంలో ఏర్పాటు చేస్తారు..ఎప్పుడు నిమజ్జనం చేస్తారు అనే వివరాలతో ఒక అర్జీని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలన్నారు. అదేవిధంగా మైక్‌లు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా రూరల్ డీఎస్పీ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. విగ్రహాలను ఏర్పాటు చేసుకునే ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం జరగకుండా పటిష్టమైన వేదికను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో తప్పనిసరిగా మండపం వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు. ముఖ్యంగా డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటుకు పోలీస్‌శాఖ అనుమతి ఇవ్వడం జరగదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రశాంతమైన వాతావరణంలో ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా శాంతి యుతంగా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ఉన్నారు.

## కొత్త పింఛన్ల పంపిణీ



**పాటూరు(కోవూరు,) సెప్టెంబరు 14 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు గ్రామంలో గురువారం నూతనంగా మంజూరైన 11 పింఛన్లను గ్రామ సర్పంచ్ బైనా శ్రీదేవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నా రన్నారు. అటువంటి వ్యక్తిని మరలా ముఖ్యమంత్రిగా అభివృద్ధి చేసే ప్రసన్నకుమార్‌రెడ్డిని కోవూరు ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులు ఉన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షకు ప్రజలు సహకరించాలి



**కోవూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని పరిగణలోకి తీసుకుని ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరులోని కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఆరోగ్య సిబ్బంది , వలంటీర్లు వచ్చి ఏయే రోజు ఈ ఆరోగ్య సురక్ష పథకానికి సంబంధించి ఏడు రకాల పరీక్షలు చేసేందుకు వస్తారో ముందుగా వలంటీర్ ఆయా కుటుంబాలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటిలో అవసరమైన వారికి ఈ ఏడు రకాల పరీక్షలు నిర్వహించి నూతన యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు ప్రజలు పూర్తిస్థాయిలో ఆరోగ్య సిబ్బందికి , వలంటీర్లకు సహకరించాలన్నారు. ఈ సర్వే కార్యక్రమం ఈ నెల 15వ తేది నుంచి మండలంలో ప్రారంభం అవుతుందని శుక్రవారం చెర్లోపాలెంలో ఈ సర్వే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ సర్వే కార్యక్రమం పూర్తయిన తర్వాత ఈ నెల 30వ తేది నుంచి ఎంపిక చేసిన స్థలాల్లో నలుగురు స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

## స్కూల్ గేమ్స్ ఎంపికలు పూర్తి



**కోవూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు , గుమ్మలదిబ్బ జిల్లా పరిషత్ పాఠశాలల క్రీడా ప్రాంగణంలో గురువారం స్కూల్ గేమ్స్‌కు సంబంధించి బాల బాలికల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రహీమ్ మాట్లాడుతూ ఇటువంటి క్రీడల వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు ఈ క్రీడల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో స్కూల్ గేమ్స్ ఎంపికల కార్యక్రమాన్ని అండర్-14,అండర్-15విభాగంలో చేపట్టారు.ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, వెంకటేశ్వర్లు నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ వెంకటరమణయ్య, మధుసూదన్‌రావు, డెలీలా, పీఈటీ అజయ్, ఉన్నారు.

## తెలుగుదేశం నాయకులు చేపట్టిన దీక్షలకు జనసేన మద్దతు



**నెల్లూరు,సెప్టెంబరు14 ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆపార్టీ జిల్లా ప్రధానకార్యాలయంలో నాయకులు చేపట్టిన దీక్షలకు జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. గురువారం జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనుకుల కిషోర్ ఆయన కార్యవర్గంతో దీక్షలు చేపడుతున శిబిరానికి చేరుకుని తెలుగుదేశం పార్టీ ముఖ్యనాయకులను పరామర్శించి వారి సంఘీబావాన్ని ప్రకటించారు.

## జగనన్న ఆరోగ్య సురక్షకు టీంలు ఏర్పాటు

**బిట్రగుంట, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** బోగోలు మండలంలో ఈ నెల 30 నుండి అక్టోబరు 31వ తేది వరకు నెల రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి మండల టీంలు ఏర్పాటు చేసినట్లు ఎంపి డివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు తెలిపారు. సచివాలయాల వారీగా ఎంపిడివో, తహశీల్దార్ టీములు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని ఈ నెల 15వ తేది నుండి ఇంటింటికి వెళ్లి వాలంటీర్లు, ఎఎన్‌యంలు వ్యా ధులతో బాధపడే వారిని గుర్తించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తే షెడ్యూల్ ప్రకారం జరిగే కార్యక్రమంలో వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

### డాక్యుమెంటు పోయినది

ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, మూలాపేట, రాజాగారి వీధికి చెందిన పోతిరెడ్డి రామశ్రీ భర్త రమేష్‌కు సంబందించిన ఒరిజినల్ డాక్యుమెంటు నెం. 5044 /2018 తేది 14.05. 2018 మూలాపేట నుండి గాంధీబొమ్మ సెంటర్‌కు మోటర్ బైక్ పై వెళుతుండగా పోయినది. సదరు డాక్యుమెంటు ఎవరికైనా దొరికిన యెడల క్రింది సెల్ నెంబరుకు తెలియజేసి, తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును. పోతిరెడ్డి రామశ్రీ సెల్ నెంబర్: 9848635863

## 8వ వార్డులో నూతన పెన్షన్లు అందజేసిన షాహుల్, ఖమర్‌బాబు



**కావలి రూరల్, సెప్టెంబరు 14 ప్రభాతవార్త** కావలి పట్టణ 8వ వార్డులో డాక్టర్ వైఎస్ఆర్ పెన్షన్లను వార్డు ఇన్‌చార్జ్ షేక్ షాహుల్, ఖమర్‌బాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నో సంక్షేమ పథకాలను వార్డు ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఆయన సహకారంతో నూతన పెన్షన్లు పంపిణీ చేయడం సంతోషంగా వుందని తెలిపారు. వార్డు ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు వుంటే తెలియజేస్తే వెంటనే ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని రాబోవు ఎన్నికలలో గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో తల్లి బిడ్డ శ్రేయస్కరం



**వరికుంటపాడు,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త :** మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డ కు ఎంతో శ్రేయస్కరం అని ఐసిడిఎస్ సూపర్ వైజర్ కళావతి అన్నారు. గురువారం మండలంలోని గొల్లపల్లి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలలో భాగంగా బాలింతలు,గర్భవతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు తప్పనీసరిగా మంచి పోషక విలువలు కలిగిన ఆ హారాన్ని తీసుకోవాలనీ,బిడ్డ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఆకు కూరలు,గుడ్లు,పండ్లు ,పప్పుదినుసలను తీసుకొవాలనీ సూచించారు.ప్రభుత్వం కూడా అంగన్ వాడీ కేంద్రాల ద్వారా మంచి పౌష్టికాహారాన్ని అందజేస్తుందనీ ,కాబట్టి గర్భవతులు,బాలింతలు సద్వినీయోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమములో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.మురళికృష్ణ,అంగన్‌వాడీ కార్యకర్తలు గంగవరపు రమాదేవి,అనూషా,రత్తమ్మ,ఆశా కార్యకర్త ,గర్భిణీలు,బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం గెలిచేంతవరకు ప్రజాపోరాటం




**జలదంకి, సెప్టంబర్14, ప్రభాతవర్త:** ప్రజాస్వామ్యంలో న్యాయమేగెలుస్తుంది,ఆదిశగ ప్రజాపోరు సల్పుతామని కాకర్ల చారిటబుల్‌ట్రస్ట్ అధినేత ఉదయగిరి నియోజకవర్గ టి.డి.పినేత కాకర్ల సురేష్ పేర్కొన్నా రు.తెలుగు దేశంపార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి అక్రమ అరెస్ట్‌కు నిరసనగ గురువారం మండలకేంద్రమైన జలదంకిలో రిలేనిరాహారదీక్ష చేపట్టారు,కె.యురోడ్‌కు సమీపంలో టి.డి.పినేతగంటా అశోక్ ఆద్వర్యంలో చేపట్టిన దీక్షలో మండల నలుమూలలనుంచి విచ్చేసిన పార్టీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.వారందరికి అశోక్ నల్లకండువలు,పూలమాలలువేసి ఆహ్వానించి దీక్షలో కూర్చోబెట్టారు.దీనికి కాకర్ల మద్దతునిచ్చి తాను దీక్షలో ఆశీనులై చంద్రబాబు అరెస్ట్‌ను తనదైనశైలిలో ఖండించారు.అనంతరం మీడియాతో మాట్లాడారు.చంద్రబాబునాయుడుపై కక్షసాదింపులో భాగంగానే నిరాధార ఆరోపణలు,అభియోగాలు అరెస్ట్‌లని దుయ్యబట్టారు.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని కుట్రలు,కుతంత్రాలు పన్నినా,మచ్చలేని మానాయకుడ్ని ఏమీచేయ లేరని దీమావ్యక్తం చేశారు.ఇలాంటి కుట్రలకు చంద్రబాబునాయుడు బెదిరిపోడని చివరకు న్యాయానిదే గెలుపని స్పష్టంచేశారు.కడిగిన ముత్యంవలే బాబుగారు బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశాడు.ఈన్యాయపోరాటంలో ఉదయగిరి నియోజకవర్గంలో పార్టీనాయకులుకార్యకర్తలకు తాను అండగా వుంటామని హామీయిచ్చారు.పార్టీశ్రేణులు నారా లోకేష్‌బాబు పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈదీక్షలో సీనియర్ టి.డి.పి నేత,మాజీ మండల ఉపాధ్యక్షుడు తల్లపనేని మధు నాయుడు,కొల్లా రాధాకృష్ణ,గుర్రంప్రవీణ్,మద్దూరు శ్రీనివాసులురెడ్డి,చెంచునాయుడు,లింగంగుంట కిష్టయ్య ,కర్తం రాజశేఖరరెడ్డి,కంచి కృష్ణారెడ్డి,అంబటి ప్రసాద్,కూరపాటిసుధాకర్‌రెడ్డి,ఇస్కా నారాయణ రెడ్డి,కొండాపురం మండల పార్టీ మాజీ కన్వీనర్ బొట్లగుంట హరిబాబు,కాకుటూరి శీనయ్య,మంగళ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అరాచక పాలన



**కోవూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా కోవూరు టీడీపీ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి చేస్తున్న రిలే నిరాహార దీక్షకు మద్దతుగా జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన టీడీపీ పార్టీలు కలిసింది సొంత ప్రయోజనాలకు కాదని, రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించి ప్రజలను ఇబ్బందుల నుంచి కాపాడుకునేందుకే ముందుకు వచ్చారన్నారు. ఇటువంటి పరిస్థితిల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ నిర్ణయానికి జనసేన నాయకులు, కార్యకర్తలు అందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కోవూరులో జరుగుతున్న అరాచకాలు త్వరలో మాయమవుతాయని ఈ సందర్భంగా కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు సుధీర్, తదితరులు ఉన్నారు.

## రూరల్ అభివృద్ధి కోసం ఎంపీ నిధులు కేటాయింపు



**నెల్లూరు సిటీ, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఎంపీ నిధులను విరివిగా కేటాయిస్తున్నామని ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి నిర్మాణ పనుల్లో భాగంగా 24వ డివిజన్ కనపర్తిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ 24వ డివిజన్‌లో ఇప్పటి వరకు 6 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. స్మశాన వాటికను అభివృద్ధి చేస్తామని స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం ఎంపీ నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. సచివాలయ వ్యవస్థ వాలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. పథకాలు పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో వెసులుబాటు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షులు ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, మూలే విజయభాస్కర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నూనె మల్లిఖార్జున యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## టీడీపీ, జనసేన పెయిడ్ పార్టీలు - ఎమ్మెల్యే అనిల్



**నెల్లూరు సిటీ, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** టీడీపీ, జనసేన పెయిడ్ పార్టీలని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. నెల్లూరు నగరం 16వ డివిజన్ జగదీశ్ నగర్ 3వ వీధి శివాలయం వద్ద రూ.1.90 కోట్లతో నిర్మిస్తున్న రోడ్లు, డ్రైయిన్ పనులకు నగర శాసనసభ్యులు పి.అనిల్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ పెండింగ్ పనులన్నింటిని త్వరలో పూర్తి చేస్తామని, ఇప్పటి వరకు 16వ డివిజన్‌కు సంబందించి మొత్తం రూ.8కోట్లతో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. తమ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. అవినీతి ఆరోపణలతో అరెస్టు రిమాండ్‌లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మద్దతు ప్రకటించడం చరిత్రలో నిలిచిపోయే ఘటనగా అభివర్ణించారు. గతంలో చంద్రబాబునాయుడు పవన్ కళ్యాణ్ సోదరుడు మెగాస్టార్ చిరంజీవిని ఇబ్బంది పెడితే నోరు విప్పని పవన్ కళ్యాణ్ ప్రస్తుతం చంద్రబాబుకోసం రోడ్డెక్కడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డబ్బులు ఇస్తేనే కానీ చంద్రబాబుకు సంఘీభావంగా టీడీపీ రోడ్లపైకి రావడం లేదని విమర్శించారు. అవినీతిపరుడైన చంద్రబాబు అరెస్టుపై సొంత కుమారుడు నారా లోకేశ్ కంటే ఎక్కువగా పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందిస్తున్నారో చెప్పాలన్నారు. దత్తపుత్రుడు అనడానికి ఇంతకంటే నిదర్శనం ఇంకేమి ఉంటుందని ప్రశ్నించారు. ప్యాకేజీలు తీసుకొని ధర్నాలు చేసే దుస్థితిలో టీడీపీ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో రెండో రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

**నెల్లూరు సెప్టెంబరు 14, ప్రభాతవార్త-వైద్యం** టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ రిమాండ్‌ను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రిలేనిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లా టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు పెద్ద సంఖ్యలో నల్ల కండువాలు ధరించి రెండో రోజు దీక్షలో పాల్గొని నిరసన తెలియజేశారు. ఇందులో భాగంగా నేను సైతం బాబు కోసం అనే కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు సంతకాలు చేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టును రాష్ట్ర ప్రజలందరూ తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. కేవలం జగన్ కక్ష సాధింపు కోసం ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపించారు. త్వరలోనే చంద్రబాబు బయటకు వస్తారని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం సుబ్బారావు, ముప్పాళ్ళ విజేతరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి హయత్‌బాబా, భువనేశ్వర్ ప్రసాద్, తాళ్లపాక అనురాధ, మామిడాల మధు, కువారపు బాలాజీ, పనబాక భూలక్ష్మీ, కప్పిర శ్రీనివాసులు, కాకర్ల తిరుమలనాయుడు, బ్రహ్మం చౌదరి, అంచూరు శ్రీనివాసులు నాయుడు, కప్పిర రేవతి, కుమారి విజయ, బీవీ శ్రీలక్ష్మీ, మంగమ్మ, పొత్తూరి శైలజ, ఆకుల హనుమంత రావు, వేణుగోపాల్, పసుపులేటి మల్లిఖార్జున్, కొల్లూరి విజయ, కమ్మ కళ్యాణి, ప్రవీణ్, పావురాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తంతో సంతకం చేసిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



**నెల్లూరు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త-వైద్యం** టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో నేను సైతం అంటూ టీడీపీ పార్టీ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే, రూరల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వినూత్న రీతిలో తన రక్తంతో సంతకం చేశారు. గురువారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రెండో రోజు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి, రాష్ట్ర పార్టీ నాయకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డిలు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును సోషల్ మీడియాని వేదికగా ఉపయోగించుకోవాలన్నారు. ఎక్కడ పదిమంది ఉంటే అక్క చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును గుసగుసల కార్యక్రమం ద్వారా అక్కడ చర్చలు మొదలుపెట్టాలన్నారు. భారతదేశంలో క్రియాశీలక వ్యక్తులలో ఒకరిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని అరెస్టు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. జిల్లా టీడీపీ నాయకులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మరో 8 నెలల్లో మరలా రూరల్ నియోజకవర్గంలో గెలిచి ప్రమాణ స్వీకారం చేస్తారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి పఠాన్ షాబీర్ ఖాన్, కనపర్తి గంగాధర్, వడ్లమూడి రమేష్, జాఫర్ ఖాన్, గోడ పద్మ, కందిరాజు వెంకట సుబ్బారావు, శశి, నెల్లూరు మురళి నాయుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల మేత తయారీ నిశిత పరిశీలన



కోవూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త : కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలోని పశువుల మేత తయారు చేస్తున్న హైటెక్ ఫార్మా, డాక్టర్ వెట్ ఫార్మాలను పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రెండు ఫ్యాక్టరీలలో తయారు చేస్తున్న పశువుల మేతకు సంబంధించి పౌర శాంతిల్స్‌ను సేకరించారు. సేకరించిన ఈ మేత శాంపిల్స్‌ను విజయవాడలోని ప్రయోగశాలకు తనిఖీల నిమిత్తం పంపడం జరుగుతుందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక పర్యాయం ఇటువంటి ఫ్యాక్టరీలో తయారు చేసే పశువుల మేతను సేకరించి ప్రయోగశాలకు పంపడం జరుగుతుంద న్నారు. 2021 ఆంధ్రప్రదేశ్ ఎనిమల్ ఫీడ్ యాక్ట్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ చట్ట ప్రకారం ఈ పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ మేతలను తయారు చేసే ఫ్యాక్టరీ యాజమానులు కూడా నిర్దేశించిన ప్రమాణాలను తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ వీఏఎస్ సజ్జాద్, పశు సహాయకులు ఉన్నారు.

## జాతీయస్థాయి అబాకస్ పోటీల్లో సత్తా చాటిన డాక్టర్ కిషోర్స్‌రత్నం విద్యార్థులు



**నెల్లూరు,సెప్టెంబరు14 ప్రభాతవార్త-విద్య** చెన్నై నగరంలో నిర్వహించిన 42వ భారతీయ అబాకస్ పోటీల్లో నగరంలోని స్థానిక డాక్టర్ కిషోర్స్ రోషిణిరత్నం హై స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచి బంగారు,వెండి పతకాలు సాధించి సత్తా చాటారు. ఈ పోటీల్లో టి.సిరీస్ స్థాయిలో బి.రోనీష్ బంగారు పతకాన్ని, రెండవ లెవెల్‌లో జసి మృత బంగారు పతకాన్ని కైవశం చేసుకున్నారు. అలాగే ప్రథమలెవెల్ లో వి.సుభిక్షయాదవ్ వెండి పతకాన్ని, మూడవ లెవెల్ నందు ఎం.సాయిచైత్ర సిల్వర్ పతకాన్ని సాధించి ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డెరుక్టర్లు డాక్టర్ కృష్ణ కిషోర్, వాసంతి కిషోర్‌లు విద్యార్థులు అభినందించారు. అలాగే రత్నం విద్యాసంస్థల జీఎం రామూర్తి నాయుడు విజేతలైన విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మనిమాల తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అరాచకపు పాలన




**ఆత్మకూరు, సెప్టెంబర్14,ప్రభాతవార్త**:రాష్ట్రంలో వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం అరాచక పాలనతో ముందుకు పోతుందని మాజీ మంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. ఆత్మకూరు బస్టాండు సెంటర్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై బనాయించిన అక్రమకేసును, అరెస్ట్‌ను నిరసిస్తూ టిడిపి పెద్ద ఎత్తున రిలే దీక్షలను గురువారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆనం రాంనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 14సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసి , 14 ఏళ్ళుగా ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్ట్ చేసి రాజమండ్రి జైల్లో ఉంచడం అత్యంత దారుణమన్నారు. ఎఫ్ఐఆర్‌లో పేరులేని చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసి 73సంవత్సరాలు వయసున్న ఆయన్ను 600కిలోమీటర్లు తిప్పుతూ చిత్రహింసలకు గురిచేయడాన్ని ఆంధ్ర ప్రజలు సహించరన్నారు. చంద్రబాబు నాయుడు ఫోటోలు, వీడియోలను తనకు పంపే బాధ్యతను శాసనసభ్యులు జూరెడ్డి భాస్కర్‌రెడ్డికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అప్పగించారన్నారు. విదేశాల్లో ఉంటూ అవిచూస్తూ జగన్ ఆనందం పొందుతుంటే అంతకంటే పైశాచిక ఆనందం మరొకటి ఉండదన్నారు. రాష్ట్ర నాయకులుగా ప్రముఖులుగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డిలను ఈ విషయంలో పక్కన పెట్టాడన్నారు. అనాగరికంగా అసత్య ప్రచారాలు చేస్తూ మీడియాముందుసజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతున్నాడన్నారు. రానున్న రోజుల్లో వైఎస్ఆర్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధిచెప్పి పాతరేస్తారన్నారు. రాష్ట్రంలో గంజాయి, మట్టి మాఫియాలు రాజ్యమేలుతున్నాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మచ్చలేని నాయకుడిగా రాజకీయ విజ్ఞతతో పరిపాలన సాగించాడన్నారు. అలాంటి వ్యక్తిని నీతి, నియమాలను పక్కనపెట్టి రాజకీయ కక్షతో జైలుకు పంపడం రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నా రన్నారు. ఈవిషయంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ముందుకు వచ్చి కష్టసమయంలో ఉన్న తెలుగుదేశం పార్టీకి తాను అండగా ఉన్నానని ముందుకు రావడం శుభపరిణామమ న్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరసించి పెద్ద ఎత్తున నిరసనధ్వనులు వినిపించడానికి తెలుగుదేశంపార్టీ శ్రేణులతోపాటు ప్రజలు కూడా పెద్దసంఖ్యలో ముందుకు వచ్చి తమ సంఘీభావం ప్రకటించాలని రామనారాయణరెడ్డి కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దావా పెంచలరావ్, నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం నాయకులు చంద్రా వెంకటసుబ్బానాయుడు, ఆత్మకూరు పట్టణ మాజీ వైస్ చైర్మెన్ చంద్రారెడ్డి, జిల్లా టిడిపి నాయకులు కేతా విజయభాస్కర్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణం, నియోజకవర్గం కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అండగా నిలిచిన ధర్మవరం గ్రామస్తులు

**వరికుంటపాడు,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త :** ఇంటికి ఆసరాగా ఉన్న వ్యక్తి అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ,ఆ కుటుంబానికి మేము ఉన్నామంటూ గ్రామస్తులు అండగా నిలిచారు.మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన కాలె వెంకటేశ్వర్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ,ఆ గ్రామానికి చెందిన యువత,పెద్దల సహాయ సహకారాలతో 4లక్షల 50 వేల రూపాయలను సమకూర్చి మృతుని పిల్లల పేరు పై పెద్దిరెడ్డిపల్లి యూనియన్ బ్యాంకులో డిపాజిట్ చేసి,ఆ డిపాజిట్ రసీదు ను బ్యాంకు మేనేజర్ రవిరెడ్డి మరియు గ్రామ పెద్దల చేతుల మీదుగా ఆ కుటుంబానికి అందజేశారు.ఈ డిపాజిట్ ద్వారా వచ్చే వడ్డీ తో పిల్లల విద్యాభ్యాసానికి ,కుటుంబానికి ఎంతగానో ఉపయోగపడుతుందనీ బ్యాంకు మేనేజర్ రవిరెడ్డి తెలిపారు.తమ గ్రామంలోని ఓ కుటుంబ కష్టాన్ని తమ కష్టాంగా భావించి సహకారం అందించిన ధర్మవరం గ్రామస్తులను,యువతను ఆయన అభినందించారు.కులాలకు,మతాలకు భిన్నంగా ,రాజకీయాలకు అతీతంగా ఉన్న ధర్మవరం గ్రామాన్ని మరిన్ని గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలనీ బ్యాంకు మేనేజర్ రవిరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమములో అసిస్టెంట్ మేనేజర్ తిరుమల రావు,ఫీల్డ్ ఆఫీసర్ దిలీప్ ,బ్యాంకు సిబ్బంది మల్లి,రమణ,గ్రామ పెద్దలు ,యువత తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీర్స్ అంకితభావంతో విధులు నిర్వహించాలి

### -తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈ హరినారాయణరెడ్డి



**నెల్లూరు,సెప్టెంబరు14 ప్రభాతవార్త-విద్య** ఇంజనీర్స్ అంకితభావంతో విధులు నిర్వహించినప్పుడే దేశం, రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయని తెలుగుగంగ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ , కడప సీఈ(ఎఫ్ఏసీ) టిజిబి కె.హరి నారాయణరెడ్డి తెలిపారు. నేడు ఇంజనీర్‌డే జరుపుకుంటున్న సందర్భంగా గురువారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. ఇంజనీరింగ్ పితామహుడు , భాతరరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 15న ఇంజనీర్ డే ని నిర్వహించుకోవటం జరుగుతుందన్నారు. ఓ అద్భుతమైన ఇంజనీర్‌గా, రాజకీయ వేత్తగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలు భావి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్రం లేదా దేశంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే ఆయా ప్రాంతాల్లో పంటలు నండుగా పండాలన్నా, పరిశ్రమలు రావాలన్నా అభివృద్ధి జరగాలన్న ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. అందుకే ఇంజనీర్స్ అంఖితభావంతో విధులు నిర్వహిస్తే ఆయా ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. నూతనంగా ఇంజనీర్స్‌గా భాద్యతలు చేపట్టినవారు విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లాలోని కార్యనిర్వాహక ఇంజనీర్లకు, శాఖ సిబ్బందికి, జిల్లా వాసులకు ఆయన ఈ సందర్భంగా ఇంజనీర్స్‌డే శుభాకాంక్షలు తెలియజేశారు.

## కేంద్రమంత్రిని కలిసి మేకపాటి



**ఉదయగిరి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి కేంద్రం టూరిజం శాఖామంత్రి జి.కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఉదయగిరి పట్టణంలోని దుర్గం,కృష్ణమందిరం,రంగనాయకుల గుడి,రోప్‌వే లాంటి సదుపాయాలు కల్పించి చారిత్రాత్మక కట్టడాలను అభివృద్ధి చేయాలని ఆయనను కోరినట్లు తెలిపారు.అందుకు గాను 50 కోట్లు నిధులు మంజూరు చేయాలని ఆయనను కోరగా అందుకు కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.ఉదయగిరి పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చెందితే అక్కడ ఉన్న వారికి అనేక మందికి ఉపాధీ లభిస్తుందని అన్నారు.

## గర్భవతులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలి

**కోవూరు , సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో ఉన్న గర్భవతులు , బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ కోవూరు ప్రాజెక్టు సీడీపీవో జ్యోతి,అన్నారు. కోవూరు మండలం తదితర ప్రాంతాల్లో పోషక వారోత్సవాల సందర్భంగా గురువారం గర్భవతులకు వైఎస్సార్ సంపూర్ణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా గర్భవతులు, బాలింతల్లో కొన్ని ప్రాంతాల్లో రక్తహీనత ఉంటుందని అటువంటి వారు తప్పనిసరిగా ఆకుకూరలు, గుడ్లు, పాలతో పాటు కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలన్నారు. రక్తహీనత అనేది ఎక్కడా లేకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి నెల గర్భవతులకు, బాలింతలకు ఇంటికే టీహెచ్ఆర్‌ను అందజేయడం జరుగుతుందని, వారు తప్పనిసరిగా వాటిని తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.౹. అనంతరం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో, సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు ఉన్నారు.










## చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తాడు



**కోవూరు, సెప్టెంబరు 14 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసిందని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. కోవూరులోని ఆర్‌అండ్‌బీ సమీపంలో గురువారం రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పథకం ప్రకారమే చంద్రబాబు నాయుడుపై అధికార పార్టీ కుట్రతోనే అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఇటువంటి పరిస్థితిలో కూడా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు శాంతియుతంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేవలం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పైశాచిక ఆనందం కోసం రాష్ట్రాన్ని బలి చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గురువార దీక్షలో కొడవలూరు మండలానికి సంబంధించిన నాయకులు విజయరెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, అమరేంద్ర, రవి,నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు. టీడీపీ నేతలు వెంకట రమణమ్మ, లేగుం టపాడు సర్పంచ్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, చక్కా సునీల్, బాల రవి, నాటకరాణి వెంకట్, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు , సెప్టెంబర్ 14 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో స్వామివారి నవరాత్రి మహోత్సవాలు మహా వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ సందర్భంగా గురువారం ప్రాత:కాలమునే ఆలయ ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు, శ్రీకాంతాచార్య ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, సహస్ర నామార్చన కార్యక్రమాలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దండి సురేష్, కుటుంబ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

## రూరల్ అభివృద్ధి కోసం నిరంతర కృషి- ఎంపీ ఆదాల



**నెల్లూరు సిటీ, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నెం బరు వన్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృ షి చేస్తానని ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 23వ డివిజన్ కార్పొరేటర్ ఒరిస్సా శ్రీనివా సులురెడ్డి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులు, అభిమానులు ఎం పీకి ఘన స్వాగతం పలికారు. 23వ డివిజ న్‌లోని అనగుంట బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో రూ.62లక్షల నిధులతో సిమెంటు రోడ్లు, సైడు డ్రైన్స్ నిర్మాణ పనులకు ఎంపీ శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్ర మాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ వంతంగా తీర్చిదిద్దుతామని ఎంపీ స్పష్టం చేశారు. 23వ డివిజన్ పరిధిలో ఇప్పటికే ఐదు కోట్ల రూపాయ లను అభివృద్ధి పనుల కోసం కేటాయించామని తెలిపారు. మరో కోటి రూపాయలు నిధులు మంజూరు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనకు అప్పగించిన నెల్లూరు రూరల్ అభివృద్ధి బాధ్యతలను శక్తి వంచన లేకుండా పూర్తి చేస్తామన్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు పేద మధ్య తరగతి ప్రజలకు పారదర్శకంగా అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. డివిజన్‌ను శరవేగంగా అభివృద్ధి చేయడంలో ప్రముఖ పాత్ర పోషించిన స్థానిక కార్పొరేటర్ ఒరిస్సా శ్రీనివాసులురెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 23వ డివిజన్ స్థానిక నాయకులు కార్పొరేటర్లు, కార్పొరేషన్ సిబ్బంది, వార్డు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.